


# క్షీరసాగర మథనం

## - నిర్మలాదిత్య

*(గత సంచిక తరువాయి)*

**వినోద్** ముఖం చూసి ఇక తన పని కాదని, ఎల్లోరా ఫార్మా ఓనర్ తాళం చెవులు తీసుకొని బయటకు వెళ్ళిపోయాడు. వినోద్ కు ఈ సారి రూమ్ బయట తచ్చాడుతున్న దివాకర్ కనపడ్డాడు. బెల్ కొట్టి అటెండర్ కి చెప్పి దివాకర్ ను పిలిపించి, దివాకర్ ఇచ్చిన రెండు వేల చెక్ మీద తన సంతకం పెట్టి, "దివాకర్ నేను ఆ బ్రాంచ్ మేనేజర్ తో మాట్లాడాను. నీకు ట్రైనింగ్ ఏర్పాటు చేస్తున్నాడు. నీవు ఆయన్ను నా పేరు చెప్పి కలవు. ఇంకో నెలలో నీ ఫ్యాక్టరీ మళ్ళీ ఆరభించాలి. ఈ చెక్ బయట చూపెట్టు. డబ్బులు ఇస్తారు", అన్నాడు వినోద్.

పనులన్నీ చేసేసరికి మధ్యాహ్నం మూడు అయ్యింది. మధ్యాహ్నం 2. 30 కి కానీ కౌంటర్లు మూయరు కాబట్టి పనంటే, పనే. ఇక లంచ్ తరువాత మరింత పని చేసి, అన్నీ అకౌంట్ల లెక్క సరిపోయిన తరువాతే బ్యాంకు సేఫ్, బ్యాంకు బ్రాంచ్ మూయవచ్చు

బాగా అలిసిపోయాడు వినోద్. పని కంటే కూడా రీజినల్ మేనేజర్ వల్ల వస్తున్నా వత్తిడుల వల్ల .

పోస్టుమాన్ ఉత్తరాలు తెచ్చినట్లున్నాడు. తన ఉత్తరాలు కూడా ఆఫీసుకే వస్తుంటాయి. అటెండర్ తనకంటూ రెండు ఉత్తరాలు తెచ్చాడు. ఒకటి ఇంట్లో నుంచి. ఏముంది నాన్న పెండ్లి చేసుకోమని తొందర పెడుతూ రాసిన ఉత్తరం అయ్యి ఉంటుంది. అది పక్కకు బెట్టి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తరం వెంటనే విప్పాడు. ఇండియన్ రెవిన్యూ సర్వీస్ కి అలాట్ చేసినట్లు ఉత్తరం. మొన్ననే యు పి ఎస్ సి ఫలితాలలో క్లాస్ 1 ఉద్యోగానికి సరిపడే 310 రాంక్ వచ్చిందని న్యూస్ పేపర్ వల్ల తెలిసినా, ఏ సర్వీసు కు అలాట్ చేస్తారో తెలియలేదు. తను ఇచ్చిన మొదటి ప్రిఫెరెన్సు ఐ ఆర్ ఎస్ దొరకడం సంతోషం వేసింది వినోద్ కు. వెంటనే ఫోన్ చేసి అమ్మ, నాన్న కు చెప్పాడు.

ఇక ఆలస్యం అనవసరం అని, రీజినల్ మేనేజర్ కు డైరెక్ట్ గా ఫోన్ చేశాడు.

" హలో వినోద్. ఏమిటీ గొడవలు. ఎల్లోరా ఫార్మా ఓనర్ నా ఎదురుగా కూర్చుని ఉన్నాడు. చెక్ నేను చెప్పానని చెబితే కూడా పాస్ చేయలేదట", సంజాయిషీ కోరుతున్న ధోరణి లో వినోద్ ని అడిగాడు రీజినల్ మేనేజర్.

"మీకూ తెలుసు కదా సార్. వాళ్ళ అప్పు లిమిట్ పైన ఉందని. మీరు లిమిట్ ఎక్కువ చేయడాన్ని ఆమోదిస్తే చేస్తే కానీ చెక్కు లు పాస్ చేయలేము. ఈ విషయం గత కొన్ని నెలలు చెప్తూనే ఉన్నాను. ఆ ఓనర్ వినటం లేదు. మీరు లిమిట్ ఎక్కిస్తూ, ఓ లెటర్ ఆ ఓనర్ చేతికిచ్చి పంపించండి చెక్ పాస్ చేస్తాను", అన్నాడు వినోద్ కొంచెం వెటకారంగానే, ఎలా ఈ జాబ్ వదిలేస్తున్నానన్న ధైర్యం తో. ఆ లెటర్ రీజినల్ మేనేజర్ ఇవ్వడని వినోద్ కి తెలుసు. మహా అయ్యితే ఈ ఎల్లోరా ఫార్మా అకౌంట్లు కూడా పి. ఎల్. కంపెనీ అకౌంట్ల లాగ తన అడుగులకు మడుగులొత్తే మరో మేనేజర్ బ్రాంచ్ కి మార్పించుకుంటాడు.

"సార్, ఇంకా నా సమస్య మీకు , ఆ ఎల్లోరా ఫార్మా కు ఉండదు. నేను నా రాజినామ పంపిస్తున్నాను", అన్నాడు వినోద్.

రీజినల్ మేనేజర్ తడబడి పోయాడు. డైరెక్ట్ రిక్రూట్ రాజీనామా అంటే ఎగ్జిట్ ఇంటర్వ్యూ అదీ అంటూ పై వరకు పోతుంది. వినోద్ తన పై ఫిర్యాదులు చేయడు కదా అని అనుమానం వచ్చింది. "ఐదు ఏళ్ళు కూడా కాలేదు, ఎలా రిజైను చేస్తావు. ఇంత మంచి ఉద్యోగం ఎక్కడ దొరుకుతుంది నీకు", కొంచెం ఆదుర్దాగా అన్నాడు రీజినల్ మేనేజర్

" ఐ ఆర్ ఎస్ లో సెలెక్ట్ అయ్యానండి. రెండు వారాల నోటీసు ఇస్తున్నాను", అన్నాడు వినోద్

రీజినల్ మేనేజర్ కి వినోద్ కి వచ్చిన ఉద్యోగం మంచిదని తెలుసు. దొరకడం కష్టం అని తెలుసు.

"వినోద్ కంగ్రాట్స్. కానీ, నీ పరిస్థితిలో నేను బ్యాంకు లో నే ఉండే వాడిని. బ్యాంకు లో పని చేయాలంటే గట్స్ కావాలి. నీవు భయస్తుడివి. అందుకే బ్యాంకు వదిలి వెళ్ళిపోతున్నావు", అక్కసుగా అన్నాడు రీజినల్ మేనేజర్.

వినోద్ రీజినల్ మేనేజర్ మాటలకూ అవ్వాకయ్యాడు. తన మీద అంత కోపం ఉందని తెలియదు. కానీ ఆలోచిస్తే, తనకున్న క్లారిటీ ఈ వ్యవస్థ లో పూడుకుపోయిన రీజినల్ మేనేజర్ కి లేదని పించింది.

"నేను సైన్స్ విద్యార్థి నండి . అన్ని లాజికల్ గానే ఆలోచించడం నేర్పారు. 1 ప్లస్ 1 రెండే. మరో అర్థం, విలువ లేదు. మీరు చెప్పే లాగ పైకి ఎదగడానికి కాలేజీలో, ఎక్కడ స్ట్రీట్ స్మార్ట్నెస్ కోర్సులు లేవు. ఉన్నా నేను తీసుకునే వాడిని కాదు. మీలా డబ్బు సంపాందించ లేక పోవచ్చునేమో కాని , ప్రశాంతంగా నిద్ర పోగలను. ఇక ఇప్పుడు నేను చేరే ఉద్యోగం చాలా మటుకు ప్రమోషన్ లు ఆటోమాటిక్ గా వస్తాయి. ఇక్కడిలాగా పైరవీలు చేయాల్సిన పని లేదు. అంతే కాక నేను ఇక్కడిలాగా ఓ అస్సహాయకుడిగా ఉండాల్సిన పని లేదు. ఎవరైనా నేరం చేస్తే, శిక్షించే అవకాశం నాకుంటుంది. నేను అది అవశ్యంగా ఉపయోగించుకుంటా ", అని పెట్టేసాడు వినోద్.

ఆ క్షణం ఒక్క సారి జైలు నుండి బయట పడి నట్లని పించింది వినోద్ కు. ప్రపంచం అందంగా మారిపోయింది.

వినోద్ బ్యాంకు లో పని ముగించుకొని ఇంటికి వెళ్తుంటే పి. ఎల్. వాళ్ళ కంపెనీ కనిపించింది, ఎందుకో పి.ఎల్ తో తను బ్యాంకు వదిలివెళ్లుతున్నాని చెప్పాలనిపించింది. పి.ఎల్ కంపెనీలకు, వినోద్ ఎల్లోరా ఫార్మా లాగానే అడ్డుపడినా , విసుక్కోలేదు. వాళ్లే, ఓ రోజు చెన్నై బ్రాంచ్ కి అకౌంట్లు మార్పించుకునేసారు. దానికి వాళ్ళకి పెరుగుతున్న ఎక్స్పోర్ట్ బిజినెస్ కారణం కావచ్చు. పి.ఎల్. ఆఫీసులోనే ఉన్నాడు.

వినోద్ పి.ఎల్ ను చూసి నవ్వుతూ "పి.ఎల్, చాలా రోజులయింది మిమ్మల్ని చూసి. ఏలా ఉన్నారు? నా బ్యాంక్ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నాను. పోయే ముందు మిమ్మల్ని కలవాలని వచ్చాను", అన్నాడు వినోద్

పి.ఎల్. ఆశ్చర్యంగా,"వినోద్ ఈ నిర్ణయం ఎప్పుడు తీసుకున్నావు. ఇంత చిన్న వయస్సులోనే డైరెక్ట్ ఆఫీసర్ గా బ్యాంక్ లో చేరావు. నీకు మంచి భవిషత్తు ఉంది కదా", అన్నాడు.

వినోద్ నవ్వుతూ "మా రీజినల్ మేనేజర్ కు కూడా , నా భవిషత్తు మీద, మీలా నమ్మకముంటే బాగుండేది. ఆయనకు ఆయన అనుకున్నంత వేగంగా నేను బిజినెస్ అభివృద్ధి పరచలేదని నిస్పృహ. రూల్స్ ప్రకారం కస్టమర్ గురించి బాగా తెలిసిన తరువాతే అప్పులివ్వాలని నా ప్రయత్నం. లోన్ మేళా లో పోలో మంటూ మంత్రి చేతుల మీద ఇచ్చిన అప్పులు ఒక్కటి తిరిగి రాలేదు. ఆదో స్కామ్ అయ్యి కూర్చుంది. అలానే ఇంకా చాలా లోన్లు. నేనీ బ్యాంక్ కల్చర్ లో ఇమడ లేనని బాగా తెలిసిపోయింది. అందుకే ఇలా", అన్నాడు.

"ఎక్కడ పోతున్నావు. మరో బ్యాంక్ కేనా?", అడిగాడు పి.ఎల్.

"లేదండి యూ పి ఎస్ సి పరీక్షలు రాసాను. ఐ ఏ స్ రాలేదు కానీ ఐ ఆర్ ఎస్ వచ్చింది. వచ్చే నెల జాయిన్ అవ్వాలి", అన్నాడు వినోద్

"అంటే ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ కదా. ఏదో ఓ రోజు ఇన్కమ్ టాక్స్ కమీషనర్ గా నిన్ను కలుస్తాను అంటే సంతోషంగా ఉంది. కంగ్రాట్స్. బ్యాంక్ కంటే నువ్వు చేయబోయే పని మంచిదేలే. టచ్ లో ఉందాం. నా ఫోన్ నెంబర్ నీదగ్గర ఉందిగా", అన్నాడు పి.ఎల్.

"సరే అలాగే" అని వీడ్కోలు తీసుకున్నాడు వినోద్.

–9 –

సెయింట్ పీట్, ఫ్లోరిడా

జూన్, 201

విశ్వం ఆఫీసు చేరే సరికి బెత్ కొత్త అకౌంట్లు రిసెర్చ్ కని పంపించింది. పిరమిడ్ అకౌంట్ల లో చాలా ఎర్రా జెండాలు ఉన్నాయి. ఇంకొంచెం టైం పిరమిడ్ అకౌంట్ల వెచ్చించ గలిగితే బ్యాంక్ కు, తన కెరీర్ ప్రోగ్రెస్ కి ఉపయోగ పడుతుంది విశ్వం నమ్మకం. కానీ బెత్ ఆలోచనలు వేరుగా ఉన్నట్టున్నాయి. లేక పోతే, తను మాట్లాడిన తరువాత ఇలా కొత్త అకౌంట్లు పంపదు.

విశ్వం తీరిక ఉన్నప్పుడు ఆ పిరమిడ్ అకౌంట్ల పైన మరింత స్టడీ చేయాలి అనుకున్నాడు. ఈ మధ్య కొత్తగా డిప్రెషన్ వస్తున్నట్లుంది. ఒకటి రెండు నిమిషాలు ఉంటుందేమో. ఎలానో పోరాడి ఆ స్టేట్ నుండి మళ్ళి పని లోను, జీవితంలోనూ పడడానికి తంటాలు పడుతున్నాడు విశ్వం.

జ్ఞానోదయం అయ్యినట్లు ఆ రోజు, ఏ మనిషి ఎక్కువ రోజులు బ్రతకదన్న ఆలోచన, సినిమా రీలు లా మనస్సులో పదే పది గా తిరుగుతున్నది. నా జీవితం కూడా చరమావాస్త లో ఉందా? నేను లేకుండా లక్ష్మి, సీతలు ఎలా ఉంటారు? లక్ష్మి పెళ్లి చూడడం, లక్ష్మి కి పుట్టబోయే బుల్లి పిల్లలతో గడిపే అవకాశం తనకు లేదా? బయట అలా ఏపుగా పెరుగుతున్న ఓక్ చెట్లు ఓ రెండు వందల ఏళ్ళు బతుకుతాయేమో. నేను వెళ్లి పోయిన తరువాత కూడ ఆ చెట్లు బతికే ఉంటాయి. అవి ఈ ముచ్చట్లు చూడ గలుగుతాయి. ఉదయిస్తున్న సూర్యుడికి, వెన్నెల కాచే చంద్రుడికి ఎన్నో తరాలుగా నా వంటి వారూ, ఈ ఓక్ చెట్లు లాంటివి, పుట్టడము. చావడం ఓ మామూలు విషయం. అలా అయ్యితే చిరాయువు అదృష్టమా? శాపమా? చా, మళ్లీ డిప్రెషన్ వచ్చేస్తున్నట్లుంది. సరికాదు అని, పని మీద దృష్టి పెట్ట ప్రయత్నించాడు విశ్వం. వీలు పడలేదు. సీత, లక్ష్మి గుర్తుకొచ్చారు. వెంటనే కళ్ళలో నీళ్లు తిరిగాయి. వెనువెంటనే తక్షణ కర్తవ్యం అర్ధం అయ్యింది.

చాలా సార్లు విల్లు రాయాలి, రాయకుండా పోతే ఆస్తులు, బ్యాంక్ అకౌంట్లు భార్యా పిల్లలకి చెందాలంటే సవాలక్ష ప్రశ్నలు, ఈ దేశంలో వస్తాయి అని అప్పుడప్పుడూ వింటూనే ఉన్నాడు. కాన్సర్ రావడం వేక్ అప్ కాల్ లాగా అనిపించింది, విశ్వానికి. కాన్సర్ వచ్చిన వాళ్ళందరూ చనిపోక పోయిన, చనిపోయే చాన్స్ అయ్యితే ఉంది. కాబట్టి ఇప్పుడు కూడా విల్లు రాయకపోవడం, సీత, లక్ష్మి లకు అన్యాయం చేసినట్లే.

తాను పనిచేస్తున్న కంపెనీ బెనిఫిట్స్ లో, లాయర్ తో సంప్రదింపులు కూడా ఒక భాగమే. బెనిఫిట్స్ లైను కు ఫోన్ చేసాడు విశ్వం.

"హలో వాట్ కేన్ ఐ డూ?", అంది అవతల కంఠం.

"నీడ్ టు స్పీక్ విత్ ఎ లాయర్", అన్నాడు విశ్వం.

కొద్దీ నిమిషాలకు, లాయర్ లైన్ కు వచ్చాడు.

విశ్వం తన పరిస్తితి వివరించి, విల్లు రాయాలి అన్నాడు.

"విల్లు రాయడం సులభం. నేనో టెంప్లేట్ పంపిస్తాను. అందులో ఉన్న ఖాళీలు నింపడం సులువే. మీరు ఆ టెంప్లేట్ పూర్తి చేసిన తరువాత నాకు పంపించి, చెక్ చేయడానికి, మరో మీటింగ్ నాతో కావాలంటే పెట్టుకోండి. టెంప్లేట్ నింపడమే కాబట్టి, మీకు నాతో మీటింగ్ పెట్టుకోవాల్సిన అవసరం లేక పోవచ్చు. మీరు రాసిన విల్లు, మీ సంతకం, సాక్ష్మి సంతకాలు పెట్టి, నోటరైజ్ చేసి జాగ్రత్తగా పెట్టుకోండి. అదెక్కడుందో మీకు కావలసిన వారికి చెప్పండి. అది చాలు", అన్నాడు లాయర్.

విశ్వం లాయర్ పంపించిన టెంప్లేట్ మాట్లాడుతుండగానే చూసాడు. లాయర్ చెప్పింది సరినే. చాలా సింపుల్ గా ఉంది ఆ ఫార్మట్. అదే చెప్పాడు లాయర్ తో.

"మీ లా ఉద్యోగం చేస్తున్న వారికి ఈ టెంప్లేట్ సరిపోతుంది. ఒక వేళ మీకు సొంత బిజినెస్ , రియల్ ఎస్టేట్ లాంటి ఆస్తులు ఈ దేశంలోనూ, విదేశాలలోను ఉన్నాయంటే లాయర్ తో సంప్రదించడం అవసరం. దానికి కూడా నేను కొంతమంది లాయర్ లను మీ సిటీ లో రెకమెండ్ చేయ గలను. మీరు వారితో మాట్లాడి, మీకు ఇష్టమైన లాయర్ తో ఒప్పొందం కుదుర్చుకొని, మీ విల్లు తయారు చేసుకోవచ్చు", అన్నాడు లాయర్.

"నాకు వేరే లాయర్ అవసరం లేదు. ఈ టెంప్లేట్ సరిపోతుంది", అన్నాడు విశ్వం.

"అన్నట్టు చెప్పడం మరిచా. విల్లు తో బాటు డి. ఎన్.ఆర్. ఫారం కూడా నోటరైజ్ చేసి పెట్టుకోండి", అన్నాడు లాయర్.

"డి. ఎన్.ఆర్ ఏమిటి, ఎందుకు?", అడిగాడు విశ్వం.

"దో నాట్ రిసుసియేట్. అంటే ఒక వేళ ఆపరేషన్ టేబిల్ పైనో, స్ట్రోక్ వచ్చో కోమాలోకి పోయి, తిరిగి ఈ లోకం కి రావడం కష్టం అన్నప్పుడు, డాక్టర్స్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్ తీసివేయడానికి పెర్మిషన్ అడుగుతారు. అలాంటి సమయంలో

మీరు నిర్ణయం తీసుకోలేరు కాబట్టి, అది ముందే ఊహించి రాసే నిర్ణయం ఇది. మీ ఫ్యామిలీకి ఆ సమయంలో ఏంతో ఆదుకున్నవారౌతారు", అన్నాడు లాయర్.

"అవును. ఈ నిర్ణయం ఇప్పుడే తీసుకోవడం న్యాయం. అనవసరంగా ఆ నిర్ణయం భార్య పిల్లల మీద వేసి వారిని గిల్టీ ఫీలింగ్ కు గురిచేయకూడదు. థాంక్స్ ఫర్ యు వర్ హెల్ప్ ", అని సెలవు తీసుకున్నాడు విశ్వం.

తరువాత రెండు రోజులు ఆ పని మీదే ఉండి, విల్లు, డి ఎన్ ఆర్ పేపర్లు సంతకాలు, నోటరైజ్ చేసి, కాపీలు ఎక్కడున్నాయో సీతకు చెప్పాడు.

"ఇవి అవసరమా? మీకు ఏమి కాదు లెండి", అంది బింకంగా సీత.

–10 –

1990 వ్యవసాయ, గ్రామీణ ఋణ మాఫీ ల పథకం కింద ప్రభుత్వ రంగం, గ్రామీణ బ్యాంక్ లనుండి ₹10,000 వరకు తీసుకున్న చిరు రుణ గ్రహీతుల అప్పులన్ని రద్దు

మహేష్, పి.ఎల్ కు అకౌంట్లు చూపెడుతున్నాడు. షరీఫ్ సలహా మేరకు, తెరిచిన స్విస్ అకౌంట్ లో బాగానే డబ్బు చేరింది.

"ఏదో హవాలా అతనిని పరిచయం చేస్తానన్నాడు కదా. కొంచెం షరీఫ్ వాళ్ళ కంపెనీ వాళ్ళతో మాట్లా డి ఏర్పాట్లు చేయి", అన్నాడు పి.ఎల్ మహేష్ తో.

మరుసటి రోజు షరీఫ్ ను కలిసి, అతని తో మహేష్, పి.ఎల్ లు హవాలా వ్యాపారి ఇంటికి పోయారు. పోర్ట్ దగ్గిరే ఓ దుకాణం లా ఉన్న బిల్డింగ్ కి తీసుకెళ్లాడు షరీఫ్. ఓ రెండు రూములు దాటినా తరువాత ఓ విశాలమైన హాల్ కనిపించింది. ఆ హాల్ మధ్యలో, ఒకతను, పొట్టిగా, పెద్ద పొట్టతో కొద్దిగా మాసిన బనియన్, లుంగీ వేసుకొని రూము లో ఉన్న వారితో ఒకరి తరువాత ఒకరితో మాట్లాడు తున్నాడు. అక్కడ వేచి ఉన్న వాళ్లలో ఓ చిర పరిచితమైన ముఖం కనిపించింది. అతను బర్మా బజార్ మనిషి. మహేష్ పై అధికారులకు బహుమతులు ఇవ్వడానికి అతని దగ్గర నుండే కొనడం. అతను మహేష్ ను చూసి మీరిక్కడ ఏంటి అన్నట్లు సంజ్ఞ చేసాడు. ఆ పొట్టి అతని పేరు మాసిలా మణి. షరీఫ్ పి.ఎల్ ను పరిచయం చేసి, ఇతను కూడా ఎగుమతులు మొదలుపెట్టారు. నీవు నాకిచ్చిన రేట్ ఈయనకు కూడా ఇవ్వు. పి.ఎల్ కి అవసర మన్నప్పుడు, నీ దగ్గరికి ఇదిగో ఈ మహేష్ ను పంపిస్తాడు", అన్నాడు షరీఫ్.

"మాసిలా మణి, షరీఫ్ పరిచయం చేసారు కాబట్టి మీరంటె భరోసానే. నాకు ఎలా జీతాలకని, చిల్లర ఖర్చు కని నెల నెలా కొంత డబ్బు క్యాష్ గా కావాల్సి వస్తుంది. నెల నెలా కమిట్ అయ్యితే నీ రేట్ ఎలా ఉంటుంది", అని అడిగాడు పి.ఎల్.

"ఈ హవాలా అంతా భరోసా మీదనే నడుస్తుంది", నవ్వాడు మాసిలా మణి.

"మీరు నెల నెలా కమిట్ అయ్యితే బాగానే ఉంటుంది. కానీ రేట్లు మరీ తేడా ఉండదు. బ్యాంక్ రేట్ కంటే మీకు లాభం వచ్చే రేట్ ప్రతీ సారి ఇస్తాం. షరీఫ్ స్నేహితులు కాబట్టి మీకు ఇంకా మంచి రేటే ఇస్తాను. మీరు డబ్బు కావలసినప్పుడు, సింగపూర్ లో నా బామర్ది ఉన్నాడు. వాడి అకౌంట్ కి డబ్బు పంపించండి. వాడు డబ్బు అందింది అన్న వెంటనే నేను మీకు ఇక్కడ రూపాయల్లో డబ్బు అందిస్తాను. వాడే ఇలా వస్తువులు కొని చెన్నై పోర్టుకి వచ్చే ఓడలలో పంపిస్తాడు. చెన్నై దగ్గర పడగానే జాలర్ల తమ చిన్న బోట్లు తో ఈ ఓడలను చేరుకొని, మా తమ్ముడు పంపిన వస్తువులు తీసుకొని, చేపల తో బాటు ఒడ్డుకు చేరుస్తారు. జాలర్లు, పోర్టులో పని చేసేవారు కొందరు నాకు పని చేస్తారు. పోర్ట్ లో ఉండే కస్టమ్స్ వాళ్ళు మా వస్తువులు అప్పుడప్పుడు పట్టుకున్నా, మాకు పెద్ద నష్టం లేదు. కస్టమ్స్ బారి నుండి పట్టుబడకుండా, మేము బర్మా బజార్ లో అమ్మే వస్తువులు వాటిని మించిన లాభాలు మా కిస్తాయి. ఇదంతా ఎందుకు చెబుతున్నాను అంటే, నమ్మకం కోసం. ఈ వ్యాపారంలో నమ్మకం లేక పోతే మొత్తం పడిపోతుంది, ఖూనీలై పోతాయి", మాసిలా మణి ముఖం తాను సీరియస్ గా మాట్లాడు తున్నాడని, తెలుపుతోంది.

బయటకు వస్తుంటే షరీఫ్ పి.ఎల్ ను చూసి "మీరు ఏ విధంగా చూసినా, అందరికి లాభమే. మీ కు పన్నులు తక్కువ. హవాలా కరెన్సీ రేట్ తేడా వల్ల మరింత లాభం. లియో వాళ్ళ కంపెనీకి లాభమే. వాళ్ళ దేశంలోను దిగుమతి పన్నులు కట్టనవసరము లేదు. మాసిలా మణి లాంటి మధ్యవర్తుల వల్ల అందరికి లాభం. ఇక దేశం గురించి బాధ పడకండి. మొత్తం పన్నులు ఎగ గొట్టడం లేదు కదా. చూస్తూనే ఉండండి మీకు ఈ విదేశీ కరెన్సీ వల్ల ఎంత లాభమో", అని సెలవు తీసుకున్నాడు.

మహేష్ కారు ఎక్కబోతుంటే, కొంచెం దూరంలో పెద్ద అరుపులు వినపడ్డాయి. జనం కూడా గోల చేస్తూ గుమి కూడ సాగారు. మహేష్ ఏమిటన్నట్లు అటు వైపు చూసాడు. ఆ గుంపులో నుంచి మహేష్ వైపు పరిగెత్తుకొస్తున్న వ్యక్తి ని చూసి

"ఏమయ్యింది?", అడిగాడు మహేష్.

"ఏదో గ్యాంగ్ కొట్లాటలు. ఒకతనిని పొడిచేసారు", అంటూ వాడు ఆగకుండా, అలాగే వేగంగా అడుగులు వేస్తూ వెళ్లిపోయాడు.

మరుసటి రోజు న్యూస్ పేపర్లో ఈ హత్య గురించి ఓ వార్త లోపలి పేజిలో సిటీ వార్తలలో కింద వచ్చింది. హత్య చేయబడింది దివాకర్ అనే యువకుడని, చంపింది ఎర్రా సామి గ్యాంగ్ మనష్యులని. దివాకర్ మత్తు మందులకు బానిస అయ్యాడని, కొనడానికి డబ్బులు లేకుండా, ఓ బ్రౌన్ షుగర్ ప్యాకెట్ ఎర్రా సామి గ్యాంగ్ వాళ్ళ నుండి చేజిక్కించుకొని పారిపోతుంటే, పొడిచేసారని వార్త. ఎర్రా సామి మనుష్యుల కోసం ఇంకా పోలీసులు వెదుకుతున్నారట.

మధ్యాహ్నం బ్యాంక్ పని మీద బ్రాంచి మేనేజర్ ను కలవడానికి పోతే అక్కడా ఆ మేనేజర్ దివాకర్ గురించే రీజినల్ మేనేజర్ తో మాట్లా డుతున్నాడు. ఆ దివాకర్ ఈ మేనేజర్ కి బాగానే తెలుసట. దివాకర్ ఎలెక్ట్రికల్స్ అని ఓ ఫ్యాక్టరీ కి తమ బ్రాంచి ద్వారానే అప్పు ఇచ్చారట. దాని ఓనర్ ఈ దివాకర్. ఈ మేనేజర్ బ్రాంచ్ కి వచ్చిన కొత్తలో దివాకర్ తనకు మరి కొంత డబ్బు అప్పుగా ఇవ్వమంటే , వీలు పడదని తరిమేసానని చెప్పాడు.

"మీకు ఇది వరకు బ్రాంచి మేనేజర్ వినోద్ తెలుసు కదండి. ఆ వినోద్ ఏదో ట్రైనింగ్ ఇప్పించాడంట. మళ్లీ ఆ మెషీన్ మీద పని చేయడానికి అప్పు ఇస్తా అన్నాడట. నమ్మ బుద్ధి కాలేదు. అడగడానికి వినోద్ లేడు. రిజైన్ చేసి పోయాడని తెలిసింది. నాకు ఇంత చిన్న అకౌంట్ పైన వెచ్చించడానికి సమయమూ లేదు, ఆ దివాకర్ చెప్పే మాటల పైన నమ్మకము లేదు", అన్నాడు ఆ మేనేజర్.

"వినోద్ అలాంటి వాడే. ఆ దివాకర్ చెప్పింది నిజమే అయ్యి ఉంటుంది", అన్నాడు మహేష్, వినోద్ గురించి తెలుసు కాబట్టి.

"నేను పని చేసే విధానం వేరండి. రీజినల్ మేనేజర్ కు అనుగుణంగా పని చేస్తాను. పెద్ద అకౌంట్ల మీద నా దృష్టి ఎక్కువ. చాలా సార్లు రీజినల్ మేనేజర్ దగ్గరనే విన్నాను, వినోద్ తల తిక్క మనిషని. అలా దివాకర్ కి ప్రామిస్ చేసినా చేసి ఉంటాడు. కాని నా నిర్ణయం సరి అయ్యిందే కదా. దివాకర్ అటు తరువాత ఈ డ్రగ్స్ కి బానిస అయ్యాడని విన్నాను. ఇప్పుడు ఈ పేపర్లో చంపేసారని వార్త వచ్చింది. అదే రీజినల్ మేనేజర్ తో చెప్పాను, ఆ దివాకర్ అకౌంట్ ఫ్రీజ్ చేస్తున్నానని", అని చెప్పాడు. ఆ మాటలలో బ్యాంక్ డబ్బులు తాను కాపాడగలిగాను అన్న గర్వం ఎక్కడో తొణికిసలాడింది.

వినోద్ బ్రాంచ్ లోనే ఉండి ఉంటే, ఈ దివాకర్ బతికి ఉండే వాడా అన్న ఆలోచన మహేష్ మనస్సులో అలా ఒక క్షణం ప్రత్యక్షమై, మాయమైంది.

–11 –

లాస్ వేగస్, నెవడ

జూలై 2014

విశ్వం, సీత లు వెనీషియన్ హోటల్ బయటకు వచ్చి మేండలే బే హోటల్ వైపు నడవ సాగారు. సీత నే విశ్వం ను బలవంతంగా సెలవు పెట్టించి లాస్ వేగస్ ట్రిప్ వేయించింది. కనీసం ఈ ట్రిప్ వల్లనైన, విశ్వం బయాప్సీ ఫలితాల గురించి మరచి పోతాడేమోనని, ఓ ఆశ. రిజల్ట్ తెలుసుకోవడాని వారం తరువాత మళ్ళీ అపోయింట్మెంట్ ఇచ్చారు. ఫోన్ లో చెప్పలేరట.

'షేర్క్ ద్యూ సొలే' షో కి టిక్కెట్లు బుక్ చేసింది సీత. అది సాయంత్రం మేండలే బే లో ఉంది. అంత వరకు అలా స్ట్రిప్ మీదున్న హోటళ్లలో కొంత సేపు కాయిన్ మషీన్ల మీద, షాపింగ్ మాల్స్ లలో సమయం గడపాలని ఆలోచన. తిండికి ఆ స్ట్రిప్ లో కొదువేమి లేదు. ఎక్కడైనా రెస్టారెంట్స్ లో తినేయొచ్చు.

అలా అక్కడక్కడ ఆగి  తిరుగుతూ ఉంటే సమయం ఇట్టే గడిచిపోతున్నది. మధ్యాహ్నం ఎం.జి.ఎం గ్రాండ్ లో లంచ్ చేసి బయటకు వస్తుంటే,

"సీత 'రెడ్ రాక్' హోటెల్ ఈ స్ట్రిప్ వెనుక ఉన్న సందులోనే ఉంది. ఓ సారి పోదామా?", అన్నాడు విశ్వం.

విశ్వం చూచే చూపులలో ఒకో సారి, ఒకో అర్ధం గోచరిస్తుంది సీతకు. ఈ చూపులో అడిగిన కోరికకు అవునని మాత్రమే సమాధానం అన్నది సీతకు అర్ధం అయ్యిపోయింది.

"దేనికి ఆ హోటల్. మనకి ఈ స్ట్రిప్ లోనే తిరగడానికి దినం సరిపోదు. మరి ఈ కొత్త సందులెందుకు. సేఫ్ కూడా కాక పోవచ్చు", అన్నది సీత బయలు దేరాడానికి సిద్ధమౌతూ.

"సేఫ్టీ గురించి నాకొదిలేయ్. ఈ హోటల్ పిరమిడ్ కంపనీ గ్రూప్ లోనిది. ఈ గ్రూప్ అకౌంట్లు మా బ్యాంక్ లోనే ఉన్నాయి. మొన్ననే నా పరిశీలనకు వచ్చాయి. ఆఫీసులో ఉన్నప్పుడు సంఖ్యలు మాత్రమే చూస్తాము. ఈ సంఖ్యల వెనుక ఉన్న సంస్థలను చూడడం తక్కువే. ఇప్పుడు అవకాశం వచ్చింది కదా,  ఓ అరగంట ఆ హోటల్ కేసినో లో గడుపుదాం. ఆ తరువాత ఈ స్ట్రిప్ మీదే గడుపుదాం. ఎలా ఈవెనింగ్ షో కి ఇంకా టైం ఉంది కదా. పోవడానికి రావడానికి ఉబర్ ఎలాను ఉంది", అంటూ తన ఫోన్ తీసి ఉబర్ ఆప్ లో రెడ్ రాక్ హోటల్ కి పోవడానికి బుక్ చేసాడు. ప్రయాణం 5 నిమిషాలే. ఉబర్ తమను పిక్ చేసుకోవడానికి అంత కంటే ఎక్కువ సమయం చూపెడుతున్నది ఆప్.

రెడ్ రాక్ హోటల్ పెద్దదే. కాదంటే స్ట్రిప్ మీదున్న హోటళ్లలో ఉన్నంత జనాలు లేరు. విశ్వం, సీతను పట్టుకొని ఆ హోటల్ కేసినో మొత్తం తిరిగాడు. కాయిన్ మెషీన్ లు చాల వరకు ఖాళీ గానే ఉన్నాయి. ఓ పది పన్నెండు వాటి దగ్గర బాగా ముసలి వాళ్ళు ,జోంబీ లు లాగా, ఇహ లోకంతో అవసరం లేనట్లు ఆడుతున్నారు. ఆశ్చర్యంగా, అటు చివరగా ఉన్న వరుసలలో ఉన్న మాషీన్లు అన్నీ ఔట్ ఆఫ్ ఆర్డర్.

బ్లాక్ జాక్, బాక్కర టేబుళ్ళు కూడా ఖాళీగానే ఉన్నాయి. అసలు ఇంత పెద్ద హోటల్, కాసినో ఎలా నడుస్తోంది అన్న సందేహం ఎవరికైనా కలుగుతుంది. ఇప్పుడు పిరమిడ్ గ్రూప్ అకౌంట్ల మీద విశ్వం కున్న సందేహాలు మరింత దృఢ పడ్డాయి.  ఈ విషయం గురించి వచ్చే వారం బెత్ తో మాట్లాడాలి అనుకున్నాడు.

విశ్వం అన్యమనస్కంగా ఎదో ఆలోచనలో ఉండడం చూసి,

"దేని గురించి మీ ఆలోచన? బయాప్సీ గురించా లేక

ఆఫీసు గురించా?", అని అడిగింది సీత.

"ఆఫీసు గురించే. సరే ఇప్పుడెక్కడ పోదాం. బెల్లాజియా లో కాఫీ తాగి, ఫౌంటైన్స్ చూద్దామా", విశ్వం సీత హాలిడే మూడ్ పాడవ గూడదని చెప్పాడు.

"ఆఫీస్ అయ్యితే పరవాలేదు. అయినా అన్ని విషయాలు మరచి, ఇక్కడ ఇప్పుడు ఎంజాయ్ చేయండి. ఇదిగో ఇప్పుడే బెల్లాజియా కి ఉబర్ బుక్ చేస్తాను", అంది సీత.

విశ్వంకు వేగస్ ట్రిప్ తో వారం ఇట్టే గడచి పోయినట్లనిపించింది.

బయాప్సీ రిజల్ట్స్ కని సాయంత్రం నర్స్ ప్రాక్టీషనేర్ తో అప్పోయింట్మెంట్ ఉంది. అది కొంచెం ఆదుర్థ కలుగ చేస్తున్నా, మధ్యాహ్నం బెత్ తో వన్ ఆన్ వన్ వీక్లీ మీటింగ్ విశ్వం కు కొంచెం ఉత్సాహాన్నే కలుగ చేసింది. రెడ్ రాక్ కేసినోలో తాను చూసిన విషయాలు, పిరమిడ్ గ్రూప్ మీద తనకున్న సందేహాలు పంచుకోవచ్చనుకున్నాడు.

బెత్ మీటింగ్ కు, ఎప్పటిలా ఓ ఐదు నిమిషాల తరువాతే జాయిన్ అయ్యింది. ముందు మీటింగ్ ఆలస్యమట. చేసిన పనులు, చేయ వలసిన పనులను గురించి మాట్లాడిన తరువాత బెత్ పోయిన వారం వెకేషన్ గురించి అడిగింది.

"వేగస్ వెళ్ళాను", అన్నాడు విశ్వం.

"ఓహ్ దట్స్ ఎక్సైటింగ్," అంది బెత్

"అదే విషయం మీతో చెప్పాలనుకున్నాను. గుడ్ సెగ్ వే. స్ట్రిప్ వెనకాల రెడ్ రాక్ హోటల్ కి వెళ్ళాను. అది పిరమిడ్ గ్రూప్ కంపనీ. నాకు ఆ హోటెల్, కేసినో చూస్తే ఎదో మనీ లాండరింగ్ నడుస్తున్నదేమో అని తోస్తున్నది. మీరు సరే అంటే, నేను ఇంకొంచెం రీసెర్చ్ చేయ గలను", అని ఉత్సాహంగా అన్నాడు విశ్వం.

బెత్ వెంటనే, "నీ కెలా చెప్పాలో అర్థం కావటం లేదు, విశ్వం. నీ పని పిరమిడ్ గ్రూపులో ఓ కంపెనీని చూడడం మాత్రమే. ఇలా మొత్తం గ్రూప్ గా శోధించడం మన డిపార్ట్మెంట్ పని కాదు. ఒక వేల ఎదో సమస్యలు ఉన్నా, వాటిని వెదక డానికి ఆడిటర్లు , రేగులేటర్లు ఉన్నారు. నీవు ఈ ఎక్స్ట్రా పనులు చేసి నాకు, పై వారికి తల నొప్పి పనులు పెట్టొద్దు", అని అంది.

విశ్వం పొంగే ఉత్సాహం మీద ఒక్క సారి చల్ల నీళ్ళు పోసిన పని అయ్యింది.

మరింకేం మాట్లాడ కుండానే బెత్ తో మీటింగ్ ముగిసింది. ముందు కోపం వచ్చినా, విశ్వం బెత్ దృక్పథం లో ఆలోచించాడు. మామూలుగా రోజు వారి రోజు పని చేస్తూ, పెద్ద సమస్యలు ఏవి లేవదీయకుంటే, బెత్ కు మంచి మేనేజర్ గా పేరు వస్తుంది, ప్రమోషన్ కూడా వస్తుంది. తాను చేసే రీసెర్చ్, అనవసరంగా పై వారి నుండి ప్రశ్నలు తెప్పించవచ్చు. దాని వల్ల కొందరు నూతన శత్రువులు కూడా ఏర్పడవచ్చు. ఎటు చూసినా బెత్ కు ఈ పని వల్ల లాభం లేదు.

ఇలానే లాగిస్తే, విశ్వం కు తనను  బెత్ ఉద్యోగం నుండి తీసేస్తుందేమో అని అనుమానమొచ్చింది. అదే ఆలోచనా సరళి సాయంత్రం ఉన్న బయాప్సీ రిజల్ట్స్ అప్పాయింట్మెంట్ ను గుర్తుకు తెచ్చింది. విశ్వం కు బాగా మూడ్ ఆఫ్ అయ్యింది. వేగస్ ట్రిప్ ఎఫెక్ట్, బెత్ తో ఇలా మీటింగ్ అయ్యిందో లేదో, ఉఫ్ మని ఆవిరి అయ్యిపోయింది.

అన్య మనస్కంగానే విశ్వం పని చేసి, సాయంత్రం తన కారు,  పార్కింగ్ గరాజ్ నుంచి తీసి, హాస్పిటల్ వైపు డ్రైవ్ చేయ మొదలెట్టాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments